క్లుప్తంగా

మొక్కలు నాటిన బీఆర్‌ఎస్‌ నాయకులు



మొక్కలు నాటుతున్న నాయకులు

వేములవాడ : కేసీఆర్‌ ప్రారంభించిన హరిత హారం కార్యక్రమం చేపట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా వేములవాడ నియోజకవర్గ హరితసేన కమల్‌గౌడ్‌ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ నాయకులు వేములవాడలో సోమవారం మొక్కలు నాటారు. మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ చేపట్టిన గ్రీన్‌ ఇండియా చాలెంజ్‌ కార్యక్రమంలో పాల్గొని హరిత హారం గుర్తుగా మొక్కలు నాటినట్లు నాయకులు తెలిపారు. రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్‌, కందుల క్రాంతి, వసల శ్రీనివాస్‌, సిరిగిరి చందు, గణేశ్‌, ప్రమోద్‌ పాల్గొన్నారు.

వైకుంఠ రథం కోసం విరాళాలు

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలో వైకుంఠరథం ఏర్పాటు కోసం పలువురు విరాళాలు అందజేశారు. ట్రాక్టర్‌ యూనియన్‌ రూ.50 వేలు, మున్నూరుకాపు సంఘం రూ.25,116, కాసనగొట్టు గౌరయ్య రూ. 20వేలు, సుంకరి రాధవ్వ రూ.25 వేలు, రొక్కం దేవరెడ్డి రూ.20 వేలు, అంబోజి లక్ష్మీనారాయణ, సాసాల రాజు, కచ్చకాయల మహేశ్‌, నీరటి సంజీవ్‌, రూ.10వేల చొప్పున, ఎరవెల్లి రాజయ్య, హమాలీ సంఘం, ట్రాలీ ఆటో యూనియన్‌, ప్యాసింజర్‌ ఆటో యూనియన్‌ రూ.5 వేల చొప్పున, ఎండీఅలీం రూ.వెయ్యి చొప్పున విరాళాలు అందజేశారు.

దేశవ్యాప్త సమ్మెకు తరలిరావాలి

ఇల్లంతకుంట: ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు జిల్లా కేంద్రానికి తరలిరావాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గన్నేరం నర్సయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో సోమవారం సమ్మెకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. నాలుగు లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలని ఆయన పేర్కొన్నారు. సీటీటీయూ మండల అధ్యక్షుడు వర్కోలు మల్లయ్య, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, సామ నర్సింహారెడ్డి, ప్రభాకర్‌, తదితరులు పాల్గొన్నారు

సమ్మె నోటీస్‌ అందజేత



ఎంఈవోకు సమ్మె నోటీస్‌ అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

చందుర్తి : మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు ఈనెల 9న సమ్మె చేపడుతున్నట్లు ఎంఈవో వినయ్‌కుమార్‌కు సోమవారం సమ్మె నోటీస్‌ అందజేశారు. తమకు పనికి తగ్గక వేతనంతో పాటు తమ డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేపడుతున్నట్లు ఎంఈవోకు వివరించారు. ఇక్కడ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు విజయ, ఉపాధ్యక్షురాలు లింగంపల్లి లక్ష్మీ, రేణుక, కొమురవ్వ, గడ్డం మల్లవ్వ, నర్సవ్వ, రాజవ్వ, లావణ్య, పద్మ తదితరులున్నారు.

చెరువులోకి నీరు వచ్చేలా పైపులు ఏర్పాటు



కోనరావుపేట: మండలంలోని కనగర్తిలోని బూరుగు చెరువులోకి నీరు వచ్చేలా పైపులు ఏర్పాటు చేశారు. మల్కపేట ప్రాజెక్ట్‌ నుంచి ఇటీవల నీరు పంపిణీ చేయగా కనగర్తిలోని బూర్గు చెరువుకు నీరు రాకుండా అడ్డుకట్ట వేసి మారుపాక, సుద్దాల గ్రామాల్లోని చెరువులకు నీరు పంపి నింపారు. రబీ సీజన్‌లో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఇరిగేషన్‌ అధికారులను సంప్రదించగా బూర్గు చెరువులోకి నీటిని పంపించేందుకు అంగీకరించి పైపులు ఏర్పాటు చేశారు. సోమవారం అడ్డుకట్టను తొలగించి పైపులు వేశారు. దీంతో ప్రాజెక్ట్‌లో నీరు విడుదల చేసినా, వర్షాలు బాగా పడినా నీరు చెరువులో చేరుతుంది. చెరువులోకి నీరు వచ్చేలా చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ గ్రామశాఖ అధ్యక్షుడు వంగపెల్లి దేవరాజు, నాయకులు రావులపెల్లి మహిపాల్‌రెడ్డి, మారుపాక శంకర్‌, తిరుపతి తదితరులు ఉన్నారు.

వన మహోత్సవంలో మొక్కలు నాటాలి

బోయినపల్లి: వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాతావరణ సమతుల్యత కాపాడాలని తహసీల్దార్‌ కాలె నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోరెంలో సోమవారం వనమహోత్సవంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో భీమ జయశీల, సెస్‌డైరెక్టర్‌ సుధాకర్‌, ఏఎంసీ చేర్మెన్‌ బోయిని ఎల్లేశ్‌ యాదవ్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

- కల్వర్టుల వద్ద కోతకు గురైన రోడ్లు
- మరమ్మతులో జాప్యం
- ప్రమాదాలబారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



దుమాల శివారులో రాపెల్లివాగు వంతెనపై కోతకు గురైన ప్రధాన రోడ్డు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు రహదారుల్లోని కల్వర్టుల వద్ద రోడ్లు వర్షంధాటికి కోసుకుపోవడం, తెగిపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ప్రమాదం అంచున ప్రయాణాలు చేస్తున్నారు. ఇరుకు వంతెనలు, కోసుకుపోయిన రోడ్లతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నా వారు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని దాటవేస్తున్నారు.

ఐదు రహదారుల్లో ఇదే పరిస్థితి..

మండలంలోని వీర్నపల్లి, రాచర్లగొల్లపల్లి, కోరుట్లపేట, బండలింగంపల్లితో పాటు సిరిసిల్ల– కామారెడ్డి రహదారుల్లో పలుచోట్ల ముఖ్యంగా కల్వర్టుల వద్ద రోడ్లు తెగిపోవడం, కోసుకుపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత ఐదేళ్లుగా తెగిన రోడ్లకు ప్రభుత్వం నుంచి మరమ్మతు పనులకు నిధులు రావడం లేదు. ప్రభుత్వం మారితే నిధులు వచ్చి మరమ్మతు పనులు చేపడుతారని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఏటా వర్షాకాలంలో రోడ్లు కోతకు గురవుతున్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతు చేయకపోవడంతో తెగిన కల్వర్టుల వద్ద పరిస్థితి అలాగే ఉంది.

కనిపించని సూచిక బోర్డులు

ప్రధాన రహదారుల వెంట కోతకు గురైన కల్వర్టుల వద్ద అధికారులు కనీసం ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. ఫలితంగా రాత్రిపూట, కొత్తవారు తెగిన రోడ్లపై ప్రయాణాలు చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు నెమ్మదిగా వెళ్లాలని సూచికలు ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తెగిపోయి ప్రమాదకంగా ఉన్న కల్వర్టుల వద్ద రోడ్లను అధికారులు మరమ్మతు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



మండంలోని దుమాల శివారులో ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిపై కోతకు గురైన రోడ్డును మరమ్మతు చేయడంలో అధికారులకు పట్టింపు లేదు. తెగిన ఈ రోడ్డు పక్కనుంచే నిత్యం వందలాది వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. గత ఐదేళ్ల క్రితం కోతకు గురైన ఈ రోడ్డును ఇప్పటివరకు మరమ్మతు చేయలేదు.

– నిమ్మల బాబు, దుమాల

నిధులు మంజూరు చేయాలి



మండలంలో కల్వర్టుల వద్ద తెగిన, కోసుకుపోయిన రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఏళ్ల తరబడి నిధులు కేటాయించకపోవడంతో తెగిన రోడ్లు మరమ్మతుకు నోచుకోవడం లేదు. వెంటనే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టకుంటే వాహనదారులతో ఆందోళన చేపడుతాం.

– చల్ల సత్యంరెడ్డి, పదిర

‘ఇందిరమ్మ’ లబ్ధిదారులు డబ్బులు ఇవ్వొద్దు



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

సిరిసిల్ల: పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కాంగ్రెస్‌ పార్టీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎవ్వరికీ ఒక్క పైసా ఇవ్వద్దని, ఎవరైనా డబ్బులు అడిగితే.. ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్‌ కోరారు. పట్టణ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కాంగ్రెస్‌ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. జిల్లాలోనే పట్టణానికి ఎక్కువ ఇళ్లను నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మంజూరు చేయించారన్నారు. కొందరు దళారులు పార్టీ పేరు చెప్పి డబ్బులు అడుగుతున్నట్లు తెలిసిందని, అలాంటి వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్‌ అర్హులైన పేదలకు ఇల్లు మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు. పార్టీకి చెడ్డపేరు తెచ్చే విధంగా ఎవరు వ్యవహరించినా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌ పార్టీ నిర్వహించిన సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులకు ప్రకాశ్‌ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్‌, పార్టీ నాయకులు ఆడెపు చంద్రకళ, వెంగల అశోక్‌, కత్తెర దేవదాస్‌, గొల్లపల్లి పర్శరాం, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్‌, నక్క నర్సయ్య, బైరి రమేశ్‌, ఆడెపు ప్రభాకర్‌, గడ్డం కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్‌

వేములవాడరూరల్‌ : వేములవాడ రూరల్‌ మండల బూత్‌ లెవెల్‌ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ అబుబాకర్‌, ఆర్‌ఐ బాలు, అన్ని గ్రామాల బూత్‌ లెవెల్‌ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కమిషనర్‌కు సన్మానం

సిరిసిల్లటౌన్‌: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పట్టణ పురపాలక సంఘం కమిషనర్‌ ఖదీర్‌పాషాను పట్టణ బీఆర్‌ఎస్‌ పార్టీ తరఫున మాజీ కౌన్సిలర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి మ్యాన రవి, మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ మంచె శ్రీనివాస్‌, అర్బన్‌బ్యాంకు చైర్మన్‌ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్‌ అడ్డగట్ల మురళి, మాజీ కౌన్సిలర్లు గడ్డం లతా భాస్కర్‌, కల్లూరి రాజు, కల్లూరి మధు, బత్తుల రమేశ్‌, బింగి రామాంజనేయులు, గడ్డం భగవాన్‌ తదితరులున్నారు. ఈ సందర్భంగా వారు పట్టణ పరిస్థితుల దృష్ట్యా రూ.101 రూపాయి దహన సంస్కారాలు నిర్వహించేలా చూడాలని, శానిటేషన్‌ చర్యలపై విన్నవించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోనరావుపేట: మండలంలోని ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు పేర్కొన్నారు. కనగర్తిలో వైద్యాధికారులు సోమవారం ఫీవర్‌ సర్వే, వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఓ మహిళకు డెంగీ వచ్చిందన్న సమాచారంతో జిల్లా, మండల వైద్యాధికారులు గ్రామంలో ఫీవర్‌ సర్వే చేశారు. జ్వరాలతో బాధపడుతున్నవారిని గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు. ఇళ్ల పరిసరాలలో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీలో వైద్యశిబిరం నిర్వహించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌యూవో మోహన్‌, సూపర్‌వైజర్‌ రషీద్‌, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ్‌చందు, హెల్త్‌ అసిస్టెంట్‌ సవాయిలాల్‌, ఏఎన్‌ఎం సంపూర్ణ, ఆశా కార్యకర్తలు శ్రీలత, నాగరాణి, లక్ష్మి, కార్యదర్శి కవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌ గ్రామ శివారులో సోమవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన నల్లనాగుల రాజు తన బైక్‌పై తిమ్మాపూర్‌ నుంచి రాచర్లగొల్లపల్లికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన క్యాదం శ్రీనివాస్‌ కారులో సిరిసిల్ల వైపు నుంచి అతివేగంగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని మండలకేంద్రంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కారు డ్రైవర్‌ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌ రెడ్డి పేర్కొన్నారు.

కుడి కాలువ ద్వారా నీరు వదలాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఇల్లంతకుంట: పొలాలకు మిడ్‌మానేరు కుడి కెనాల్‌ ద్వారా నీటిని వదలాలని ప్రభావిత గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్‌ ఎంఏ ఫారుక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌ మాట్లాడుతూ ఇరిగేషన్‌ అధికారులకు తెలుపుతానని రైతులకు వివరించారు. రైతులు మాట్లాడుతూ వారం రోజుల్లో కాలువ ద్వారా నీరు వదలకుంటే మిడ్‌మానేరు రైట్‌ కెనాల్‌ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. కాలువ ద్వారా నీటిని వదిలితే వల్లంపట్ల, వంతడుపుల, గాలిపెల్లి, నర్సక్కపేట, జవారిపేట, రంగంపేట, గ్రామాల రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇక్కడ రైతులు కే వెంకట నరసింహారెడ్డి, పి.రవీందర్‌ రెడ్డి, చిమ్మన గొట్టు శ్రీనివాస్‌, అనిల్‌, స్వామిరెడ్డి తదితరులున్నారు.

అదనపు టీచర్‌ను కేటాయించాలి

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల ప్రాథమిక పాఠశాలకు అదనపు టీచర్‌ను కేటాయించాలని గ్రామస్తుడు చిమ్మనగొట్టు శ్రీనివాస్‌ సోమవారం కలెక్టర్‌ సందీప్‌ కుమార్‌ ఝా కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఐదు తరగతుల్లో 50 మంది విద్యార్థులుండగా ఇద్దరే టీచర్లు ఉన్నారన్నారు. ఈ మేరకు డీఈవోతో మాట్లాడి అదనపు టీచర్‌ను సర్దుబాటు చేయాలని కలెక్టర్‌ ఆదేశించారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట: టీబీ ముక్త్‌భారత్‌లో భాగంగా మండలంలోని వెంకటాపూర్‌లో సోమవారం క్షయవ్యాధి నివారణపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. మండల పీహెచ్‌సీ వైద్యాధికారి సారియా అంజుమ్‌ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతోపాటు పొగాకు తీసుకునే వారు క్షయవ్యాధికి గురయ్యే అవకాశం ఉందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, రాత్రి పూట చెమటలు పట్టడం, బరువు తగ్గే లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. గ్రామంలోని 135 మందికి పైగా టీబీ స్క్రీనింగ్‌ పరీక్షలు చేశామన్నారు. 25 మంది అనుమానితుల నుంచి తెమడ నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. టీబీ సూపర్‌వైజర్‌ మహిపాల్‌, హెచ్‌ఏ బాబు, హెచ్‌ఎస్‌ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, చైతన్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

హై లెవల్‌ వంతెన పూర్తి చేయండి

బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో అసంపూర్తిగా ఉన్న స్తంబంపల్లి హై లెవల్‌ బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని నాయకులు అక్కెనపెల్లి కరుణాకర్‌ సోమవారం కలెక్టర్‌ సందీప్‌కుమార్‌ ఝాకు వినతిపత్రం అందజేశారు. వంతెన పనులు పూర్తి చేయాలని గతంలో స్తంభంపల్లి నుంచి కలెక్టర్‌ కార్యాలయ వరకు పాదయాత్ర, బైక్‌ ర్యాలీలు చేపట్టి వినతిపత్రాలు ఇచ్చినా పనులు మొదలు కాలేదన్నారు. కాగా పనులు ప్రారంభించాలని కలెక్టర్‌ పీఆర్‌ ఈఈని ఆదేశించారని కరుణాకర్‌ తెలిపారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలు పంపిణీ

వేములవాడఅర్బన్‌: వేములవాడ మండలం అగ్రహారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మిడ్‌ మానేరు నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలను మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర తెలిపారు.

ఎల్‌వోసీ మంజూరు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌ గ్రామానికి చెందిన మారుపాక చంద్రయ్య అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఆస్పత్రిలో చేరగా చికిత్స కోసం ప్రభుత్వం రూ.2.50లక్షలు ఎల్‌వోసీ మంజూరు చేసింది. చంద్రయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రిలో చేరగా విషయాన్ని బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన విప్‌ ప్రభుత్వం నుంచి వైద్య ఖర్చుల కోసం రూ.2.50లక్షల ఎల్‌వోసీని సోమవారం మంజూరు చేశారు. ఈసందర్భంగా విప్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన అరుణ్‌ కుమార్‌ (27) స్నేహితుడు సాయి చరణ్‌తో కలిసి పెద్దూర్‌ వైపు ఆది వారం వెళ్తుండగా అదే సమయంలో కారు వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో అరుణ్‌ కుమార్‌ తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం కరీంనగర్‌ తరలించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



కోనరావుపేట: మండలంలోని కనగర్తిలోని ఎస్సీ కాలనీలో విద్యుత్‌ స్తంభం ప్రమాదకరంగా మారడంతో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి కనెక్షన్లు బదలాయించారు. ఈ స్తంభాన్ని తొలగించడం మరిచారు. అధికారులు స్పందించి వృథాగా ఉన్న స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
అధికారి. దివ్య, సెస్‌ ఏఈ, సెల్‌ : 9440814078



సిరిసిల్ల టౌన్‌ : మందకృష్ణ జన్మదిన వేడుకల్లో ఎమ్మార్పీఎస్‌ నేతల అభివాదం

ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ వేడుకలు, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ కట్‌ చేసి సంబరాలు జరిపారు. జిల్లాలోని అంబేద్కర్‌ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్‌ టౌన్‌ ప్రెసిడెంట్‌ బడుగు లింగం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ హాజరై మాట్లాడారు. సిరిసిల్ల అంబేద్కర్‌ సంఘాల అధ్యక్షుడు కత్తెర దేవదాస్‌, పట్టణ కాంగ్రెస్‌ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్‌ , బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్‌, నాయకులు, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్‌



వేములవాడ అర్బన్‌ : తిప్పాపూర్‌లో కేక్‌ కట్‌ చేస్తున్న నాయకులు



కోనరావుపేటలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్థిక సాయం చెక్కు అందజేత



ఆర్థికసాయం చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన జర్నలిస్ట్‌ గర్దాస్‌ ప్రసాద్‌ (43) ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం కుటుంబాన్ని పరామర్శించారు. సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్న ప్రసాద్‌ తల్లిదండ్రులు, భార్య పిల్లలను ఓదార్చారు. తనవంతుగా రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కలెక్టర్‌ సందీప్‌కుమార్‌ ఝాతో ఫోన్‌లో మాట్లాడిన మేడిపల్లి సత్యం ప్రసాద్‌ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. రూ.50వేల ఆర్థిక సాయం అందించేందుకు కలెక్టర్‌ అంగీకరించారు. ఇల్లు లేని ప్రసాద్‌ కుటుంబానికి రగుడు వద్ద డబుల్‌ బెడ్రూం ఇల్లు కేటాయించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. సానుకూలంగా కలెక్టర్‌ స్పందించి పక్షం రోజుల్లో ప్రసాద్‌ కుటుంబానికి డబుల్‌ బెడ్రూం ఇల్లు మంజూరుకు చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఆయన వెంట కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్‌, పార్టీ నాయకులు సంగీతం శ్రీనివాస్‌, ఆకునూరి బాలరాజు తదితరులు ఉన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి



బైక్‌ ర్యాలీ తీస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్‌: కార్మికక్షేత్రం సిరిసిల్లలో సోమవారం శ్రామికవర్గాలు నినదించాయి. ఈనెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెపై సోమవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ట్రేడ్‌యూనియన్స్‌ జేఏసీ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్‌ నుంచి అంబేడ్కర్‌చౌక్‌, నేతన్న పైలాన్‌ మీదుగా కొండా లక్ష్మణ్‌బాపూజీ చౌక్‌ వరకు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. సమ్మె విజయవంతం చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల నుంచి 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలను చేసే చర్యలకు దిగిందన్నారు. సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో పాల్గొని ఆర్డీవో ఆఫీస్‌ నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, ఉపాధ్యక్షులు పంతం రవి, కోడం రమణ, మీసం లక్ష్మణ్‌, ఎగమంటి ఎల్లారెడ్డి, జు వ్వాజి విమల, సోమిశెట్టి దశరథం, వెంగళ శ్రీ నివాస్‌, ఆకుల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు



బోయినపల్లి: మండలకేంద్రంలోని కేజీబీవీ, మోడల్‌స్కూల్‌లలో నాన్‌ టీచింగ్‌ పోస్టులకు స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంఈవో ఎస్‌. శ్రవణ్‌కుమార్‌ తెలిపారు. కేజీబీవీలో హెడ్‌ కుక్‌–1, మోడల్‌స్కూల్‌లో అసిస్టెంట్‌ కుక్‌–2 పోస్టులకు పది మంది దరఖాస్తులు చేసుకోగా 8 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో భీమ జయశీల, తహసీల్దార్‌ కాలె నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వీర్నపల్లి: మద్దిమల్ల తండా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వేణుగోపాల్‌ రాచర్ల గుండారం మీదుగా పాఠశాలకు వెళ్తున్నాడు. మద్దిమల్ల పెద్దమ్మ ఆలయం వద్ద బైక్‌ అదుపుతప్పి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.